# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంపుటి : 2 | సంచిక : 290 | శనివారం 25 మే 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను




## రైతులను కాంగ్రెస్ సర్కార్ దగా చేసింది

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రుణ మాఫీ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి రైతులను దగా చేశాడు
- కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ. 2,683 రూపాయల మద్దతు ధర ఇస్తామని చెప్పి సన్న వడ్లకు మాత్రమే ఇస్తానని చెప్పి మోసం చేస్తున్నారు
- కరెంట్ విషయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు
- తమ హయాంలో కరెంటు సమస్య ఎలా ఉండెదో గుర్తుచేసుకోవాలి

నల్గొండ

రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. శుక్రవారం నకిరేకల్‌లో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నకిరేకల్‌కు కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. రుణ మాఫీ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి రైతులను -మిగతా3లో

## రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఈసీ అనుమతి



- ఏర్పాట్లు చేయాలని సీఎస్ ఆదేశం
- సీఎం ముందుగా గన్ పార్క్ ను సందర్శించి తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పిస్తారు
- పరేడ్ గ్రౌండ్ వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్ల పై అధికారులకు సీఎస్ దిశానిర్దేశం
- సభా ప్రాంగణం పరిసర ప్రాంతాలలో పారిశుధ్య పనుల నిర్వహణ తోపాటు తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలి
- రోడ్లకు ఇరువైపులా రంగురంగుల జెండాలను అలంకరించాలి
- పండుగ వాతావరణాన్ని తలపించేలా కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలి
- ఎన్నికల నిర్వహణలో ప్రమేయం ఉన్న రాష్ట్ర ప్రభుత్వ అధికారిని సమావేశానికి పిలవవద్దని ఈసీ ఆదేశం







హైదరాబాద్

జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శుక్రవారం ఉన్నతాధికారులతో సమీక్షించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించేందుకు ఈసీ ప్రభుత్వానికి అనుమతి ఇవ్వడంతో, అందుకు తగిన విధంగా విస్తృత ఏర్పాట్లు చేయాలని శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించనున్నట్లు తెలిపారు. సీఎం ముందుగా గన్ పార్క్ ను సందర్శించి తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పిస్తారని అన్నారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్ వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్ల పై అధికారులకు సీఎస్ దిశానిర్దేశం చేశారు. ప్రముఖులు ప్రయాణించే మార్గాలలో అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, పార్కింగ్ స్థలాలను -మిగతా3లో

## ప్రశాంత్ కిశోర్ బీజేపీ మనిషి

- తేజస్వి యాదవ్ సంచలన ఆరోపణలు
- ప్రశాంత్ కిశోర్ కు బీజేపీ ఆర్థికసాయం చేస్తోందన్న తేజస్వి
- ఎన్నికల్లో ఓడిపోతున్నామని బీజేపీకి అర్థమైందని వ్యాఖ్యలు
- అందుకే ప్రశాంత్ కిశోర్ ను పిలిపించారని వెల్లడి
- ఒకరి నుంచి డేటా సేకరించి మరొకరికి ఇచ్చేస్తుంటాడని ఆరోపణ



## ఆ జిల్లాలో 48 గంటల పాటు వైన్ షాపులు, బార్లు బంద్

- ఉమ్మడి నల్గొండ-ఖమ్మం-వరంగల్ జిల్లాల్లో 48 గంటల పాటు వైన్ షాపులు, బార్లు మూసివేత
- గ్రాడ్యుయేట్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ శాఖకు పోలీసు అధికారుల ఆదేశాలు
- రేపు సాయంత్రం 4 నుంచి 27 సాయంత్రం 4 గంటల వరకు దుకాణాల బంద్
- 27న గ్రాడ్యుయేట్స్ ఉప ఎన్నికలకు పోలింగ్




హైదరాబాద్

ఉమ్మడి నల్గొండ-ఖమ్మం-వరంగల్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖకు పోలీసులు కీలక ఆదేశాలు జారీ చేశారు. 48 గంటల పాటు వైన్ షాపులు, బార్లు మూసివేయాలని ఆదేశించారు. అయితే పోలింగ్ జరిగే మూడు ఉమ్మడి జిల్లాల్లో ఈ దుకాణాలు బంద్ చేయనున్నారు. మే 27న పోలింగ్ ఉంది. దీంతో రేపు సాయంత్రం 4 గంటల నుంచి 27 సాయంత్రం సాయంత్రం 4 గంటల వరకు వైన్ షాపులు, బార్లు మూతపడనున్నాయి. ఎమ్మెల్సీ ఉప ఎన్నిక బరిలో మొత్తం 52 మంది అభ్యర్థులు ఉన్నారు. 4,61,806 పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు.

## బంగాళాఖాతంలో 'రెమాల్' తుపాను...

- మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం
- ఇది మరింత బలపడి తుపానుగా, ఆపై తీవ్ర తుపానుగా మారే అవకాశం
- ఒడిశా, బెంగాల్ రాష్ట్రాల్లో భారీ వర్షాలు
- ఏపీలో అత్యధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతాయన్న ఐఎండీ




- ఫోన్‌కాల్స్‌తో హడలిపోతున్న పట్టభద్రులు..!
- "హలో.. నేను మీ పట్టభద్రుల ఉప ఎన్నిక అభ్యర్థిని.."
- హడలిపోతున్న పట్టభద్రులు..!
- అన్ని పార్టీల్లోని రాష్ట్ర స్థాయి నేతలంతా ఉమ్మడి జిల్లాలో సుడిగాలి పర్యటనలు
- సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవాలని బీఆర్ఎస్
- ఈసారి ఎలాగైనా పాగా వేయాలని కాంగ్రెస్ పట్టుదల
- ఎక్కువ మంది ఓటర్లను చేరుకునేలా వివిధ పార్టీల అభ్యర్థులు ప్లాన్
- నేరుగా ఓటర్లకు ఒకటికి పది సార్లు ఫోన్ చేసి విసుగ్గ తెపిస్తున్న అభ్యర్థులు




# వామ్మో..!

రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక జరుగుతున్న ఆ మూడు ఉమ్మడి జిల్లాల్లో ఫోన్ కాల్స్ అంటేనే ఓటర్లు హడలిపోతున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు చేస్తున్న ప్రచారం కొత్త పుంతలు తొక్కుతోంది. వినూత్న రీతిలో అభ్యర్థులు నేరుగా ఓటర్లకు ఫోన్లు చేస్తున్నారు. ఫోన్ మోగిందంటే చాలు, భయపడే పరిస్థితి ఏర్పడింది.

హైదరాబాద్

వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచార ఘట్టం చివరి అంకానికి చేరుకుంది. దీంతో ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. అన్ని పార్టీల్లోని రాష్ట్ర స్థాయి నేతలంతా ఉమ్మడి జిల్లాలో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. అభ్యర్థుల ప్రచార శైలితో పట్టభద్రులు హడలిపోతున్నారు. సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవాలని బీఆర్ఎస్, ఈసారి ఎలాగైనా పాగా వేయాలని కాంగ్రెస్ పట్టుదలతో వ్యవహరిస్తోంది. ఈ ఎన్నికల్లోనూ బలమైన ఓట్లు సాధించాలని బిజెపి భావిస్తోంది. వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గంలో 4.61 లక్షల మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. అభ్యర్థులు.. వీరి ఫోన్ నంబర్లను సేకరించి పట్టభద్రులకు కాల్స్ చేస్తున్నారు అభ్యర్థులు. ప్రచార గడువు చివరి దశకు చేరుకోవడంతో తక్కువ సమయంలోనే ఎక్కువ మంది ఓటర్లను చేరుకునేలా వివిధ పార్టీల అభ్యర్థులు ప్లాన్ చేస్తున్నారు. నేరుగా ఓటర్లకు ఫోన్లు చేయిస్తున్నారు. అభ్యర్థులు రోజులో ఒకటి కాదు రెండు కాదు దాదాపు పది నుంచి 12 ఫోన్ కాల్స్ వస్తుండటంతో ఫోన్ మోగిందంటే భయపడే పరిస్థితి ఏర్పడింది. హలో.. నేను మీ పట్టభద్రుల ఉప ఎన్నిక అభ్యర్థిని.. అంటూ ఎన్నికల ప్రచారంతో ఫోన్స్ లో పట్టభద్రులను ఊదరగొడుతున్నారు. సాధారణ ప్రచారంలో భాగంగా అభ్యర్థులు పట్టభద్రులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. బయట హంగామా ప్రచారాలు లేకున్నా సెల్‌ఫోన్లతో అభ్యర్థులు హోరెత్తిస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు కూడా కొందరు రికార్డింగ్ కాల్స్ చేస్తున్నారు. తక్కువ సమయంలో ఎక్కువమంది ఓటర్లను కలిసేందుకు అభ్యర్థులు ఈ తరహా ఫోన్ కాల్స్ చేస్తున్నారు. ఒక్కో అభ్యర్థి మూడు, నాలుగు రకాలుగా ప్రచార కాల్స్ చేస్తున్నారు. తమ పనుల్లో నిమగ్నమైన సమయాల్లో -మిగతా3లో

# అమిత్ షాకు లైన్ క్లియర్ చేస్తున్న మోదీ



**న్యూఢిల్లీ :** కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా.. ప్రధానిగా బాధ్యతలు చేపట్టేందుకు ప్రధాని మోదీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారని ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. అమిత్ షాను ప్రధానిని చేయడం కోసం.. ఆ పార్టీలోని సీనియర్ నేతలు శివరాజ్ సింగ్, వసుందర రాజే, ఖతర్ సాహెబ్, డాక్టర్ రమణ్ సింగ్‌లను పక్కన పెట్టారని ఆరోపించారు. నేడో రేపో యూపీ ప్రస్తుత సీఎం యోగి ఆధిత్యనాథ్‌ను సైతం పక్కన పెడతారన్నారు. అందుకు సంబంధించిన ప్రచారం సైతం ఇప్పటికే ప్రారంభమైందని చెప్పారు. శుక్రవారం న్యూఢిల్లీలో మీడియాకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో కేజ్రీవాల్ మాట్లాడారు. 2019లో అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా కేజ్రీవాల్ గుర్తు చేశారు.
బీజేపీలో 75 ఏళ్లు వచ్చినా.. ఆ వయస్సు దాటిన నాయకులంతా తప్పకుండా రిటైర్ కావాల్సిందేనని అమిత్ షా స్పష్టం చేశారన్నారు. అందులో ఎటువంటి రాజీ లేదని అమిత్ షా చెప్పారన్నారు. కావాలంటే.. నాడు అమిత్ షా చేసిన ఈ వ్యాఖ్యలు.. ఇంటర్నెట్‌లో చెక్ చేసుకోవచ్చునంటూ కేజ్రీవాల్ సూచించారు. అయితే ఆ రూల్ ప్రకారమే బీజేపీలోని సీనియర్లు ఎల్ కె అద్వానీ, మురళీ మనోహర్ జోషి, సుమిత్రా మహాజన్ తదితరులంతా పార్టీ నుంచి తప్పుకున్నారన్నారు. ఇటువంటి నేపథ్యంలో బీజేపీలో ప్రస్తుతమున్న నాయకాగణం సైతం ఆ రూల్ ప్రకారం నడుచుకోవాల్సిందేనని కేజ్రీవాల్ అభిప్రాయపడ్డారు.
ఢిల్లీ మద్యం కేసులో మనీ లాండరింగ్ వ్యవహారంలో ఈ ఏడాది మార్చి 21న ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేసింది. అనంతరం ఆయన తీహాడ్ జైలుకు తరలించింది. అయితే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తన పార్టీ తరఫున ప్రచారం చేసుకోవాలంటూ సుప్రీంకోర్టులో ఆయన బెయిల్ పిటిషన్ వేశారు.
ఈ నేపథ్యంలో కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు ఇటీవల కండిషన్లతో కూడిన మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అనంతరం ఢిల్లీలోని తన పార్టీ అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. అందులోభాగంగా బీజేపీ అగ్రనేతలను లక్ష్యంగా చేసుకొని కేజ్రీవాల్ విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. అందులోభాగంగా 2025, సెప్టెంబర్ 17వ తేదీతో ప్రదాని నరేంద్ర మోదీకి 75 ఏళ్లు వస్తాయన్నారు. బీజేపీ పెట్టుకున్న రూల్ ప్రకారం.. 75 ఏళ్లు వచ్చిన వారు రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకోవాల్సి ఉంటుదన్నారు. ఆ క్రమంలో మోదీ రిటైర్‌మెంట్ కాక తప్పదన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో మీ పార్టీ ప్రధాన మంత్రి అభ్యర్థి ఎవరంటూ బీజేపీ నేతలకు సూటిగా కేజ్రీవాల్ సవాల్ విసిరారు.
దీనిపై కేంద్ర మంత్రి అమిత్ షా స్పందించారు. మూడోసారి కూడా ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీనే ఉంటారని అమిత్ షా స్పష్టం చేశారు. అటువంటి వేళ.. కేజ్రీవాల్ బీజేపీలో అమిత్ షాను ప్రధాని పీఠంపై కూర్చోబెట్టేందుకు మోదీ ప్రణాళికాబద్దంగా ముందుకు వెళ్తున్నారని కేజ్రీవాల్ ఆరోపించారు.

# ప్రశాంత్ కిశోర్ బీజేపీ మనిషి



ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ ఓ బీజేపీ ఏజెంట్ అంటూ ఆర్జేడీ నేత, బీహార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వి యాదవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికల వ్యూహంలో భాగంగా ప్రశాంత్ కిశోర్ కు బీజేపీ నిధులు అందిస్తోందని ఆరోపించారు.
సార్వత్రిక ఎన్నికల్లో మూడు, నాలుగు దశల పోలింగ్ తర్వాత ఓడిపోతున్నామన్న విషయం బీజేపీ నాయకత్వానికి అర్థమైందని... అందుకే ప్రశాంత్ కిశోర్ ను పిలిపించారని తేజస్వి యాదవ్ వ్యాఖ్యానించారు.
"గతంలో అమిత్ షా కోరిక మేరకే ప్రశాంత్ కిశోర్ ను జేడీయూ ఉపాధ్యక్షుడిగా నియమించామని మా అంకుల్ (నితీశ్ కుమార్) చెప్పారు. ఇప్పటివరకు అమిత్ షా కానీ, ప్రశాంత్ కిశోర్ కానీ ఆ వాదనను ఖండించలేదు. అతడి రాజకీయ ప్రస్థానం ఆరంభం నుంచి బీజేపీతోనే ఉన్నాడు. అతడు ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ నాశనం అవుతుంది. అతడు కేవలం బీజేపీ ఏజెంట్ మాత్రమే కాదు... బీజేపీ వ్యూహకర్త కూడా. అతడు వాళ్ల భావజాలాన్ని అనుసరిస్తున్నాడు.
అతడు ప్రతి ఏటా వేర్వేరు వ్యక్తులతో పనిచేస్తుంటాడు. అతడు మీ నుంచి డేటా సేకరించి వేరొకరికి ఇచ్చేస్తుంటాడు. అతడు బీజేపీ మనిషి. బీజేపీ అతడికి ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలుస్తోంది" అంటూ ప్రశాంత్ కిశోర్ పై తేజస్వి యాదవ్ విమర్శనాస్త్రాలు సంధించారు.

**అసత్యాలతో అమిత్ షా విద్వేష వ్యాప్తి**

కాషాయ పార్టీ లక్ష్యంగా ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ విమర్శలతో విరుచుకుపడ్డారు. బిహార్‌లో విద్వేషం వ్యాప్తి చేసేందుకే కేంద్ర హెూంమంత్రి అమిత్ షా వస్తారని, అసత్యాలతో విషం వెదజల్లుతారని అన్నారు. తేజస్వి యాదవ్ పట్నాలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. అమిత్ షా అసత్యాలను బిహార్ ప్రజలు విశ్వసించరని స్పష్టం చేశారు. అసత్యాలు, విద్వేష వైఖరిని బిహార్ ఎన్నటికీ అనుసరించదని చెప్పారు. ఉద్యోగాలు, ఉపాధి కల్పన దిశగా బిహార్ అడుగులు వేస్తుందని స్పష్టం చేశారు. గత పదేండ్లుగా నరేంద్ర మోదీ హయాంలో కేంద్ర ప్రభుత్వం బిహార్ అభివృద్ధి కోసం ఏ చేసిందని ఆయన నిలదీశారు. కాగా, ఈ ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ కేవలం ఫొటోలకు ఫోజులు ఇవ్వడం, జెండాలు ఊపడం వరకే పరిమితమయ్యారని అంతకుముందు ఆర్జేడీ నేత తేజ్ ప్రతాప్ యాదవ్ అన్నారు. బీజేపీకి ఈ ఎన్నికల్లో పరాజయం తప్పదని జోస్యం చెప్పారు. ఇక ప్రధాని నరేంద్ర మోదీ నయ వంచనతో బిహార్‌ను నట్టేట ముంచారని పాటలీపుత్ర లోక్‌సభ నియోజకవర్గ ఆర్జేడీ అభ్యర్థి మిసా భారతి ఆరోపించారు.

# ప్రెసిడెంట్ రేసులో ట్రంప్...



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్ష అభ్యర్థిత్వ రేసులో రిపబ్లికన్ పార్టీ తరఫున డోనాల్డ్ ట్రంప్‌కు గట్టి పోటీ ఇచ్చిన నిక్కీ హేలీ ఎట్టకేలకు ట్రంప్‌కు మద్దతు ప్రకటించారు. రాబోయే అధ్యక్ష ఎన్నికల్లో తాను ట్రంప్‌కే ఓటు వేస్తానని స్పష్టం చేశారు. హడ్సన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వాషింగ్‌టన్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఈమేరకు ప్రకటన చేశారు. నిక్కీహేలీ అధ్యక్ష రేసులో రిపబ్లిక్ పార్టీ తరఫున నిలిచారు. అయితే వివిధ రాష్ట్రాల్లో జరిగిన ప్రైమరీ ఎన్నికల్లో ట్రంప్ కన్నా తక్కువ ఓట్లు సాధించారు. దీంతో చేసేది లేక పోటీ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. చివరకు పార్టీ అభ్యర్థిగా ట్రంప్ ఖరారయ్యాడు. అయితే పోటీ నుంచి తప్పుకున్న నిక్కీ హేలీ.. ట్రంప్ గురించి ఒక్క మాట మాట్లాడలేదు. మద్దతు ఇస్తానని కూడా తెలుపలేదు. దీంతో చాలా మంది ఆమె మద్దతు ట్రంప్‌కు దక్కదని భావించారు. నిక్కీ మద్దతు దారులు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడతారేమో అన్న అనుమానాలు వచ్చాయి. కానీ ఎట్టకేలకు ఆమె మౌనం వీడారు. అనుమానాలను పటాపంచలు చేశారు. రిపబ్లికన్ పార్టీ ఏకతాటిపై ఉందన్న సందేశాన్ని ఇచ్చారు. హేలీ మాట్లాడుతూ అధ్యక్ష ఎన్నికల రేసులో తనకు అండగా నిలిచిన మద్దతుదారులను ట్రంప్ ఇపుపడు తనవైపు తిప్పుకోవాలని సూచించారు. వారి మద్దతు కూడగట్టడం కోసం ఆయన శ్రమించాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. గుడ్డిగా వారంతా తన వెనకాలే ఉంటారని ట్రంప్ అనుకుంటే పొరపాటే అవుతుందని పేర్కొన్నారు. ప్రైమరి ఎన్నికల రేసులో నిలిచిన సమయంలో హేలీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ట్రంప్‌పై వ్యక్తిగత విమర్శలు కూడా చేశారు. పోటీ నుంచి తప్పుకున్నాక ట్రంప్‌వైపు నిలబడలేదు. దీంతో రిపబ్లికన్ పార్టీ చీలిపోతుందన్న అనుమానాలు కూడా వచ్చాయి. కానీ ఎట్టకేలకు మద్దతు ప్రకటించారు. కానీ, తన మద్దతుదారులను బైడెన్ తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నాడని నిక్కీహేలీ తెలిపారు. ఇదిలా ఉండగా, నిక్కీహేలీ అధ్యక్షుడు బైడెన్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. అమెరికా?మెక్సికో సరిహద్దు వివాదాన్ని ఉదహరిస్తూ బైడెన విదేశాంగ విధానాన్ని తప్పప పట్టారు. తన ప్రచారానికి విరాళాలు ఇచ్చిన వారికోసం ఇటీవల ఆమె దక్షిణ కరోలినాలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. అయితే తదుపరి రాజకీయ కార్యాచరణ ప్రకటించలేదు.

## మ్యాజిక్ ఫిగర్‌కు దూరంగా బీజేపీ : శశి థరూర్




లోక్‌సభ ఎన్నికల ఐదో దశ పోలింగ్ ముగిసిన అనంతరం దేశవ్యాప్తంగా విపక్ష ఇండియా కూటమికి సానుకూల వాతావరణం ఉన్నట్టు వెల్లడవుతోందని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అన్నారు. బీజేపీ మెజారిటీ మార్క్‌కు దూరంగా నిలుస్తుందని చెప్పారు. ఇది దేశంలో ఏ ఒక్క ప్రాంతంలో కాదని, ప్రతిచోటా ఇదే వాతావరణం ఉందని అన్నారు. తమ అభ్యర్థుల్లో ఉత్సాహం నెలకొనగా, బీజేపీ అభ్యర్థుల్లో నైరాశ్యం కనిపిస్తోందని పేర్కొన్నారు. బీజేపీకి పట్టున్న ప్రాంతాల్లో పోలింగ్ శాతం తగ్గుముఖం పట్టిందని, తాము ఎన్ని స్థానాలు దక్కించుకుంటామనే సంఖ్యను వెల్లడించకున్నా ట్రెండ్ మాత్రం ఓ నిర్దిష్ట దిశగా సాగుతున్నట్టు అర్థమవుతోందని అన్నారు. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యే నాడు కేంద్రంలో ప్రభుత్వం మారుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. లోక్‌సభలో ప్రస్తుతం బీజేపీకి 303 మంది సభ్యులు ఉండగా, వారు మెజారిటీ మార్క్‌కు చాలా దిగువకు పడిపోనున్నారని, ఎన్డీయే కూటమి పక్షాలు కూడా బీజేపీకి మెజారిటీ సాధించి పెట్టే పరిస్థితి ఉండదని శశి థరూర్ అంచనా వేశారు. లోక్‌సభ ఎన్నికలు ఏడు దశల్లో జరగనుండగా ఇప్పటికి ఐదు దశలు పూర్తయ్యాయి. మే 25, జూన్ 1న చివరి రెండు దశల పోలింగ్ జరగనుండగా, జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు.

# నా ఆరోగ్యంపై బీజేపీ దుష్ప్రచారం




మయూర్‌భంజ్: భారతీయ జనతా పార్టీపై ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ మండిపడ్డారు. తన ఆరోగ్యంపై బీజేపీ దుష్ప్రచారం చేస్తోందని, తాను పూర్తి ఆరోగ్యంతో ఉన్నానని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా గత నెలరోజులుగా తాను ప్రచారం సాగిస్తున్నట్టు తెలిపారు. "అబద్ధాలు చెప్పడానికైనా ఒక హద్దంటూ బీజేపీకి ఉండాలి. నేను చాలా ఆరోగ్యంగా ఉన్నాను. అది మీరు చూస్తూనే ఉన్నారు. నెలరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం సాగిస్తూనే ఉన్నాను" అని మయూర్‌భంజ్‌లో మీడియాతో మాట్లాడుతూ నవీన్ పట్నాయక్ అన్నారు.

**అసలేం జరిగింది..?**

కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా ఇటీవల ఒడిశాలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో 77 ఏళ్ల నవీన్ పట్నాయక్ రిటైర్ కావడం మంచిందంటూ వ్యాఖ్యానించారు. వయసు పైబడటం, ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న పట్నాయక్ రిటైరు కావాలని, బీజేపీని గెలిచిపిస్తే ఒడియా మాట్లాడే యువ 'భూమిపుత్రుణ్ణి' ముఖ్యమంత్రిగా చేస్తామని అన్నారు. ఒడిశా రాష్ట్రాన్ని బీజేడీ ప్రభుత్వం ధ్వంసం చేస్తోందని, ఒడియా ప్రజల గౌరవానికి భంగం కలిగిస్తూ, ఒడిశా సంస్కృతి, ప్రతిష్టను పీకనులుముతోందని ఆరోపించారు. ఒడిశాలో ఎంతో ఖనిజ సంపద, కష్టపడి పనిచేసే యువత ఉన్నప్పటికీ కష్టపడి పనిచేసే ముఖ్యమంత్రి లేదని విమర్శించారు. ఖనిజ సంపదను లూటీ చేసేందుకు నవీన్ బాబు ఏమాత్రం వెనుకాడటం లేదన్నారు. పర్యాటకం పేరుతో ప్రఖ్యాత జగన్నాథ ఆలయం సంస్కృతి, సంప్రదను బీజేపీ ప్రభుత్వం ధ్వంసం చేస్తోందని, శ్రీక్షేత్రాన్ని కమర్షియల్ సెంటర్‌గా మార్చాలనుకుంటోందని తప్పుపట్టారు. ఈసారి అటు అసెంబ్లీ ఎన్నికల్లోనూ, లోక్‌సభ ఎన్నికల్లోనూ కమల వికాసం ఖాయమని, ఐదు విడతల లోక్‌సభ ఎన్నికల్లో మోదీ 310 సీట్లు దాటారని, ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లోనూ 75కు పైగా సీట్లు గెలుచుకోనున్నామని చెప్పారు.

## బంగాళాఖాతంలో 'రెమాల్' తుపాను...




బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారింది. ప్రస్తుతం మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉన్న ఈ వాయుగుండం మరింత బలపడి తుపానుగా మారనుందని భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) వెల్లడించింది. తుపానుగా మారితే దీనిని 'రెమాల్' అని పిలవనున్నారు. కాగా, ఈ నెల 25వ తేదీ రాత్రికి తీవ్ర తుపానుగా బలపడి పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ మధ్య తీరం దాటనుంది. దీని ప్రభావంతో ఈ నెల 25, 26 తేదీల్లో ఉత్తర ఒడిశా తీర ప్రాంత జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నెల 26, 27 తేదీల్లో పశ్చిమ బెంగాల్ లోని తీర ప్రాంత జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ పేర్కొంది. ఈ నెల 28 వరకు బెంగాల్ లో వర్షాలు కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. అదే సమయంలో, ఏపీపై ఈ తుపాను ప్రభావం ఏమాత్రం ఉండదని, రాష్ట్రంలో ఎండలు మండిపోతాయని ఐఎండీ స్పష్టం చేసింది. ఏపీలో వేడి గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ వివరించింది. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వెల్లడించింది.

## బెంగళూరు రేవ్‌పార్టీ కేసులో కీలక పరిణామం




బెంగళూరులోని జీఆర్ ఫామ్‌హౌస్‌లో జరిగిన రేవ్ పార్టీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు విచారణలో భాగంగా హెబ్బగోడి పీఎస్‌కు చెందిన ముగ్గురు పోలీసులపై వేటు పడింది. ఏఎస్సై నారాయణ స్వామి, కానిస్టేబుళ్లు గిరీశ్, దేవరాజును సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. రేవ్ పార్టీ గురించి తెలిసినప్పటికీ.. విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు గానూ వారిని సస్పెండ్ చేశారు. అనేకల్ ఏఎస్పీ మోహన్ కుమార్, ఇన్‌స్పెక్టర్ అయ్యన్న యాదవ్‌లకు నోటీసులు జారీ చేశారు. మరో ఇద్దరు పోలీసులకు మెమోలు జారీ చేశారు. కాగా, బెంగళూరు రేవ్ పార్టీ ఇటీవల దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. సన్‌సెట్ టు సన్‌రైజ్ విక్టరీ పేరుతో నిర్వహించిన ఈ పార్టీకి 150 మంది హాజరవ్వగా.. వీరిలో 105 మంది మాత్రమే పట్టుబడ్డారు. మిగిలివారు తప్పించుకున్నారు. ఈ కేసులో 14.40 గ్రాముల ఎండీఎంఏఈ పిల్స్, 1.16 గ్రాముల ఎండీఎంఏ క్రిస్టల్, 5 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో పట్టుబడిన వారికి పరీక్షలు నిర్వహించగా.. 86 మంది డ్రగ్స్ తీసుకున్నట్లుగా వెల్లడైంది. వీరిలో 59 మంది పురుషులు ఉండగా.. 27 మంది మహిళలు ఉన్నారు. ఈ కేసులో ఏ1గా వాసు, ఏ2గా అరుణ్‌కుమార్, ఏ3గా నాగబాబు, ఏ4గా రణ్‌ధీర్ బాబు, ఏ5గా మహమ్మద్ అబూబాకర్, ఏ6గా గోపాల్‌రెడ్డి పేర్లను నమోదు చేశారు. ఇక టాలీవుడ్‌కు చెందిన హేమ, ఆషీరాయ్ కూడా డ్రగ్స్ తీసుకున్నట్లు వెల్లడైంది.

## కాంగ్రెస్, ఎస్పీ కూటమి హయాంలో ఉగ్ర దాడుల కలకలం : యోగి ఆదిత్యానాథ్



యూపీలో ఎస్పీ, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన ప్రతిసారీ ఉగ్ర దాడులు పెచ్చుమీరుతాయని యూపీ సీఎం యోగి ఆదిత్యా నాథ్ అన్నారు. ఎస్పీ హయాంలో అయోధ్యలోని రామాలయం, కాశీలో సంకట్ మోచన్ ఆలయాలపై దాడులు జరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎంగా అఖిలేష్ యాదవ్ మొట్టమొదట ఉగ్రవాదులపై కేసులు ఉపసంహరించారని, అదృష్టవశాత్తూ ఈ వ్యవహారంలో న్యాయస్థానం జోక్యం చేసుకుందని వివరించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా యోగి ఆదిత్యానాథ్ శుక్రవారం దియోరియాలో జరిగిన ర్యాలీని ఉద్దేశించి మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో అన్ని వర్గాల అభ్యున్నతికీ చర్యలు చేపడుతున్నామని చెప్పారు. మోదీ ప్రభుత్వ హయాంలో అందరికీ భద్రత, ప్రతి ఒక్కరికీ గౌరవం, అభివృద్ధి, పేదల సంక్షేమం ప్రాధాన్యతలుగా ముందుకు సాగుతున్నామని అన్నారు.

## ప్రజ్వల్ పాస్‌పోర్టు రద్దు చేయండి.. కేంద్రానికి కర్ణాటక ప్రభుత్వం లేఖ



**బెంగళూరు:** లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న హసన్ ఎంపీ, జేడీఎస్ నేత ప్రజ్వల్ రేవణ్ణ పాస్‌పోర్టు రద్దు చేయాలని కర్ణాటక ప్రభుత్వం శాశ్వత వ్యవహారాల మంత్రిత్వ శాఖకు శుక్రవారం లేఖ రాసింది. ప్రజ్వల్ ఏప్రిల్ 27న జర్మనీకి వెళ్లిపోయాడు. అతడ్ని తిరిగి భారత్ రప్పించాలని కర్ణాటక ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ప్రజ్వల్‌ను అన్ని కోణాల్లో విచారించి నేరం రుజువైతే కఠిన శిక్షలు పడేలా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. ఇప్పటికే ప్రజ్వల్‌ని భారత్‌కి తిరిగి రమ్మని మాజీ ప్రధాని దేవెగౌడ కోరారు. లేదంటే తన ఆగ్రహానికి గురి కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. స్వదేశానికి తిరిగి వచ్చి దర్యాప్తు సంస్థలకు సహకరించాలని సూచించారు.

**గతంలోనే సిద్దరామ్య లేఖ..**

కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సైతం గతంలోనే ప్రధాని మోదీకి లేఖ రాశారు. "ప్రజ్వల్ రేవణ్ణను భారత్‌కు తిరిగి తీసుకురావాలి. ఇందుకోసం కేంద్రం చొరవ తీసుకోవాలి. ఆయన పాస్‌పోర్టును శాశ్వతంగా రద్దు చేయాలి. రేవణ్ణపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడానికి కొన్ని గంటల ముందు పాస్‌పోర్ట్ ఉపయోగించి జర్మనీకి పారిపోవడం సిగ్గుచేటు. నిందితుడికి లుక్ అవుట్, బ్లూ కార్నర్, సెక్షన్ 41%ూ జతీూజ% కింద నోటీసులు పంపినా స్పందించకపోవడం ఆందోళన కలిగిస్తోంది" అని మోదీకి రాసిన లేఖలో సిద్దరామయ్య పేర్కొన్నారు.

# రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఈసీ అనుమతి

-మొదటి పేజి తరువాయి

కేటాయించేటప్పుడు ట్రాఫిక్ రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి ట్రాఫిక్ కు అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు చేపట్టాలని పోలీసు శాఖను ఆదేశించారు. సభా ప్రాంగణం పరిసర పారంతాలలో పారిశుధ్య పనుల నిర్వహణ తోపాటు తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, రోడ్డుకు ఇరువైపులా రంగురంగుల జెండాలను అలంకరించాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సాంస్కృతిక శాఖను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు.

జూన్ 2న జరగనున్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొనాల్సిందిగా ఆ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీని ఆహ్వానించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను విభజించిన పదేళ్ల తర్వాత తొలిసారిగా సోనియా గాంధీ ఈ బహిరంగ సభలో పాల్గొననున్నారు. హైదరాబాద్ ఉమ్మడి రాజధాని అంశం, పంట రుణాల మాఫీని తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలు 2024 పూర్తయ్యే వరకు వాయిదా వేయాలని ఇటీవల ఎన్నికల సంఘం తెలిపింది.






దీంతోపాటు ఎన్నికల నిర్వహణలో ప్రమేయం ఉన్న రాష్ట్ర ప్రభుత్వ అధికారిని సమావేశానికి పిలవవద్దని ఈసీ ఆదేశించింది. దేశవ్యాప్తంగా లోక్ సభ ఎన్నికలు జరుగుతున్న క్రమంలో అనేక ప్రాంతాల్లో ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. ఈ క్రమంలో ఏదైనా కొత్త ప్రభుత్వ పథకాలు అమలు చేయాలంటే ఎన్నికల సంఘం అనుమతి తప్పక తీసుకోవాల్సిందే.

# హామీలను విస్మరించిన కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి

**హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులను, నిరుద్యోగులను మోసం చేసింది. ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని మోసపూరిత హామీలిచ్చి గెలిచాక ఒక్క హామీ కూడా అమలు చేయలేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. శుక్రవారం పట్టభద్రుల ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలో నిర్వహించిన సన్నాక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. హామీలను అమలు చేయకుండా మొద్దునిద్రపోతున్న కాంగ్రెస్‌ను తట్టి లేపాలంటే ఆ పార్టీని ఓడగొట్టాలి. అధికారంలోకి వచ్చి ఆరు నెలలై ఒక్క జాబ్ నోటిఫికేషన్ లేదు. జాబ్ క్యాలెండర్ లేదు. 2 లక్షలు ఉద్యోగాలు భర్తీ చేసేది ఇలాగేనా? అని ప్రశ్నించారు. నిరుద్యోగులకు 4 వేల భృతి, విద్యార్థులకు 5 లక్షల భరోసా కార్డు, అమ్మాయిలకు ఉచిత స్కూటీ.. ఒక్క హామీ అమలు కాలేదన్నారు. ఉద్యోగులకు 4 డీఏలు పెండింగులో ఉన్నాయి. డీఏపై కేబినెట్లో నిర్ణయం తీసుకుంటామని చెప్పిన రేవంత్ రెడ్డి మాటమీద నిలబడలేదని విమర్శించారు. ఉపాధ్యాయ్యులపై లాఠీ చార్జ్ చేశారు. ఇంతకన్నా అమానుషం ఉంటుందా? అని సూటిగా ప్రశ్నించారు.

**సిగ్గులేకుండా రైతులను మోసం చేశారు**

నిరుద్యోగ భృతి ఇస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పింది. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, ప్రియాంక గాంధీ స్వయంగా చెప్పారు. కానీ అలాంటి హామీనే ఇవ్వలేదని అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలాడు తున్నారని మండిపడ్డారు.



వడ్లకు 500 బోనస్ ఇస్తామని మీ మేనిఫెస్టోలో చెప్పి ఇప్పుడు సన్నవడ్లకే అని సిగ్గులేకుండా రైతులను మోసం చేశారని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతుడైన రాకేశ్ రెడ్డిని గెలిపించి కాంగ్రెస్‌కు గుణపాఠం నేర్పాలన్నారు. హైదరాబాద్‌ను మరో పదేళ్లు ఉమ్మడి రాజధానిగా చేసేందు బీజేపీ కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. మన హైదరాబాద్ మనకే దక్కాలంటే అందరూ బీఆర్ఎస్ పార్టీకే ఓటు వేయాలన్నారు. ఖమ్మం జిల్లా విజ్ఞులు, మేధావులు, విద్యావంతులు, నిరుద్యోగులు, ఉద్యోగులు రాకేశ్ రెడ్డికి ఓటు వేయండి. మీ తరపున ఆయన శాసన మండలిలో పోరాడతాడని హామీనిచ్చారు.

**హైదరాబాద్‌ను యూటీగా మార్చేందుకు కుట్రలు**

హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చేందుకు కుట్రలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. యూటీ చేస్తే మన హైదరాబాద్ మనకు దక్కదని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ లేని తెలంగాణ.. తల లేని మొండెంలాంటిదని అభిప్రాయపడ్డారు. మధిర నియోజకవర్గ స్థాయి పట్టభద్రుల ఎన్నికల సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో.. ప్రశ్నించే గొంతుకనే గెలిపించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అందర్నీ మోసం చేసిందని.. ఆరు నెలల్లోనే నిజస్వరూపం బయటపడిందని హరీశ్‌రావు అన్నారు. ఆరు నెలలు అయినా ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేదని అన్నారు. నిరుద్యోగ భృతి విషయంలో చేతులెత్తేశారని అన్నారు. నిరుద్యోగ భృతి గురించి అడిగితే మేం హామీనే ఇవ్వలేదని కాంగ్రెస్ అంటుందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నీళ్లు, కరెంట్ మాయమయ్యాయని.. కేసీఆర్ కిట్లు బంద్ అయ్యాయని హరీశ్‌రావు అన్నారు. ఇంకెన్ని రోజులు కేసీఆర్‌ను తిట్టుకుంటూ కాంగ్రెస్ నేతలు బతుకుతారని మండిపడ్డారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఓడిస్తేనే కాంగ్రెస్‌కు కనువిప్పు కలుగుతుందని అన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేయడం అంటే.. కాంగ్రెస్ అబద్ధాలను ఆమోదించడమే అని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లాలోని 7 మండలాలను ఏపీకి బీజేపీ అప్పగించిందని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఇప్పుడు హైదరాబాద్‌ను యూటీ చేసేందుకు కాంగ్రెస్, బీజేపీ కుట్రలు చేస్తున్నాయని వ్యాఖ్యానించారు.

## హైదరాబాద్‌ను యూటీ చేస్తారన్న హరీశ్ రావు వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన బీజేపీ నేత

**హైదరాబాద్‌ను యూటీగా చేస్తారనడం సరికాదన్న బీజేపీ నేత ప్రకాశ్ రెడ్డి**

**హరీశ్ రావు దిగజారి మాట్లాడుతున్నారని ఆగ్రహం**

**ఎమ్మెల్యేగా, మంత్రిగా చేసిన వ్యక్తి బోడిగుండుకు... మోకాలికి లింక్ పెడుతున్నారని వ్యాఖ్య**



హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న మాజీ మంత్రి హరీశ్ రావుపై బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌ను యూటీగా చేస్తారని మాట్లాడటం సరికాదన్నారు. హరీశ్ రావు దిగజారి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం... 20 ఏళ్ళకు పైగా ఎమ్మెల్యేగా, మంత్రిగా చేసిన వ్యక్తి బోడిగుండుకు... మోకాలికి లింక్ పెడుతున్నారని విమర్శించారు. హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలు ఆయన స్థాయిని దిగజార్చేలా ఉన్నాయన్నారు. ఆయన వ్యాఖ్యలు తలాతోక లేని వ్యాఖ్యలు చేశారన్నారు. అంతకుముందు, హరీశ్ రావు మాట్లాడుతూ... హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చబోతున్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఏర్పడి పదేళ్లయిందని... ఈ నేపథ్యంలో హైదరాబాద్‌ను మరికొన్నాళ్లు ఉమ్మడి రాజధానిగా లేదా కేంద్రపాలిత ప్రాంతంగా చేయాలనే కుట్రలు జరుగుతున్నాయన్నారు. అదే జరిగితే మన హైదరాబాద్ మనకు కాకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ మనకు దక్కాలంటే యావత్ తెలంగాణ ప్రజలు ఒక్కటై తెలంగాణ పార్టీ బీఆర్ఎస్ వైపు ఉండాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్ వాళ్లకు రాజకీయం కావాలని... కానీ కేసీఆర్‌కు తెలంగాణతో పేగుబంధం ఉందన్నారు. గతంలో పదేళ్లు కామన్ క్యాపిటల్ అంటే కేసీఆర్ వ్యతిరేకించారని.. ఇప్పుడు మరోసారి అలాంటి కుట్రలు జరుగుతున్నాయన్నారు. హైదరాబాద్ కామన్ క్యాపిటల్ కాదని... తెలంగాణ క్యాపిటల్ అన్నారు.

# వామ్మో!

-మొదటి పేజి తరువాయి

ఈ ఫోన్ కాల్స్ ఓటర్లను విసిగిస్తున్నాయి. కొన్ని కాల్స్ నిమిషం నిడివి ఉన్నవి కాగా, మారికొన్ని 30-40 సెకండ్ల నిడివి గల రికార్డెడ్ కాల్స్ చేస్తున్నారు.

ఇక కొందరు అభ్యర్థులైతే నేరుగా కాన్ఫరెన్స్ కాల్స్ ఓటు వేయాలంటే అభ్యర్థిస్తున్నారు. కొందరు అభ్యర్థులు తమను తాము పరిచయం చేసుకుంటూ ఇతర పార్టీలను విమర్శిస్తూ 3-4 నిమిషాల రికార్డెడ్ కాల్స్ కూడా వస్తున్నాయి. అభ్యర్థులు నేరుగా తమ గొంతుతో రికార్డు చేసి ఫోన్లు చేస్తున్నారు. మరికొందరు రాష్ట్రస్థాయిలో, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మాజీ మంత్రులు, సెలబ్రెటీలతోనూ తమకు ఓటు వేయాలని చెప్పించుకునే వీడియోలు వాట్సప్‌లో చక్కర్లు కొడుతున్నాయి. మొత్తం మీద ఈ ఫోన్ కాల్స్‌తో విసిగిపోతున్న పట్టభద్రులు.. పోలింగ్ జరిగే 27వ తేదీ కోసం ఎదురు చూస్తున్నారు.

# మూడు పార్టీలకు కొత్త బాస్‌లు..?

**హైదరాబాద్** తెలంగాణలో రాజకీయ పార్టీలు మార్పులు కూర్పుల దిశగా ముందుకు సాగుతున్నాయి. మూడు ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు సంస్థాగతంగా సంచలన మార్పులకు శ్రీకారం చుట్టబోతున్నాయి. రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పే పార్టీల రాష్ట్ర అధ్యక్షుల నియామకాలపై ఫోకస్ పెట్టాయి కాంగ్రెస్, బీజేపీ. ఇక మరో పార్టీ బీఆర్ఎస్ సైతం ఇదే దిశగా అడుగులు వేస్తోంది. పార్టీని ఏ రకంగా ముందుకు తీసుకెళ్లాలి? ఎలాగూ రాష్ట్ర అధ్యక్షుడిగా కేసీఆర్ ఉంటారు, వర్కింగ్ ప్రెసిడెంట్ గా కేటీఆర్ ఆల్రెడీ ఉన్నారు. అడిషనల్ గా ఇంకేమేమి చేయాలి? ఈ దిశగా కేసీఆర్ కసరత్తు చేస్తున్నారు.తెలంగాణలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగిశాయి. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు జూన్ 4న విడుదల కాబోతున్నాయి. అప్పటివరకు రాజకీయ పార్టీల నేతలకు కొంత గ్యాప్ దొరికింది. ఈ గ్యాప్ లో.. ఆయా పార్టీల్లో ఎలాంటి సంస్థాగత మార్పులు చేయాలి? అనేదానిపై అన్ని పార్టీలు దృష్టి పెట్టాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బండి సంజయ్ ని తొలగించిన ఆయన స్థానంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కిషన్ రెడ్డిని నియమించారు.కాగా, అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల వరకు మాత్రమే కిషన్ రెడ్డి అధ్యక్షుడిగా ఉంటారని ముందుగానే జాతీయ స్థాయి నాయకత్వం క్లారిటీ ఇచ్చింది. దాంతో దాదాపుగా జూన్ నెలలోనే కిషన్ రెడ్డి అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవడం ఖాయం. అదే నెలలోనే బీజేపీలో అధ్యక్ష మార్పు ఉండబోతోంది.ఇటు కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే.. ఆ పార్టీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని విజయతీరాలకు చేర్చారు. ఆయన కృషికి ఫలితం దక్కింది. ముఖ్యమంత్రి కూడా అయ్యారు. దీంతో కాంగ్రెస్ కూడా కచ్చితంగా పీసీసీ అధ్యక్షుడిని మార్చబోతోంది. లోక్ సభ ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ కి కొత్త అధ్యక్షుడు రానున్నారు.ఇక బీఆర్ఎస్ విషయానికి వస్తే.. రాష్ట్ర అధ్యక్షుడిగా మొదటి నుంచి కూడా కేసీఆర్ ఉన్నారు. 2019లో బీఆర్ఎస్ మరోసారి అధికారం చేపట్టింది. ఆ తర్వాత వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని కేటీఆర్ కి కట్టబెట్టారు. అధ్యక్షుడిగా కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా కేటీఆర్ ఇద్దరూ.. ఈ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించారు. అయితే అనుకున్న ఫలితాలు రాలేదు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయింది. మళ్లీ కార్యకర్తలను, పార్టీని పునరుత్తేజం చేసేందుకు క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా కేసీఆర్ అడుగులు వేస్తున్నారు.అధికారంలో ఉన్న పదేళ్లు పార్టీని పట్టించుకోలేదు, సంస్థాగతంగా నిర్మించలేదనే ఒక విమర్శ ఉంది. ఎన్నికలకు ఒక ఏడాది ముందు మాత్రమే అన్ని జిల్లాల్లో బీఆర్ఎస్ కార్యాలయాలను ప్రారంభించారు. జిల్లా అధ్యక్షులను మాత్రమే నియమించింది తప్పితే రాష్ట్ర కార్యవర్గం కానీ జిల్లా కార్యవర్గం కానీ ఎక్కడా లేదు. కాబట్టి కార్యవర్గ నిర్మాణాలతో పాటు, బీఆర్ఎస్ లో ఉన్న మరో కీలక నేత హరీశ్ రావుకి కొంత ప్రాధాన్యత ఇచ్చే దిశగా అడుగులు పడుతున్నట్లుగా తెలుస్తోంది.మొత్తంగా మూడు ప్రధాన పార్టీల్లో ఎలాంటి మార్పులు జరగబోతున్నాయి? ఆ పార్టీల్లో ఏం జరగబోతోంది? లోక్ సభ ఎన్నికల ఫలితాల తర్వాత ఎలాంటి మార్పులు ఉండనున్నాయి? ఉన్న నాయకత్వాన్ని ఎలా కూర్పు చేయబోతున్నారు? ఇలాంటి అంశాలపై స్పెషల్ అనాలసిస్.. "చక్రం తిప్పే రాష్ట్ర అధ్యక్షులు ఎవరు?"

## భక్తులకు గుడ్ న్యూస్.. స్వామి వారి సేవలు ఇకపై ఆన్‌లైన్‌లో..



యాదాద్రి భక్తులకు శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం ఉన్నతాధికారులు గుడ్ న్యూస్ చెప్పారు. స్వామి వారి దర్శనంతోపాటు ఆర్జిత సేవలు ఇకపై ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకోవచ్చని భక్తులకు తెలిపారు. స్వామి వారిని దర్శించుకొనేందుకు నిత్యం లక్షలాది మంది భక్తులు యాదాద్రికి తరలి వస్తున్నారని... ఈ నేపథ్యంలో వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈ చర్యలు తీసుకున్నట్లు దేవస్థానం ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ఆ క్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం భక్తుల కోసం తీసుకు వచ్చిన సౌకర్యాలన్నీ యాదాద్రిలో తీసుకు వస్తామని స్పష్టం చేశారు. అందులోభాగంగానే ఆన్‌లైన్ సేవలు తీసుకు వచ్చామని వివరించారు. ఆన్‌లైన్‌లో yadadritemple.telangana.gov.in. వెబ్‌సైట్‌లోకి వెళ్లి.. టికెట్లు బుక్ చేసుకోవచ్చని భక్తులకు సూచించారు. ఇక ఇదే వెబ్‌సైట్ నుంచి ఈ హుండీకి విరాళాలు ఇవ్వ వచ్చునని భక్తులకు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా గంట ముందు స్వామి వారి దర్శనం, పూజ కైంకర్యాలకు బుక్ చేసుకో వచ్చని యాదాద్రి దేవస్థానం ఉన్నతాధికారులు వివరించారు.

తెలంగాణ రాష్ట్రంలో అత్యంత మహిమాన్విత పుణ్య క్షేత్రాలు చాలానే ఉన్నాయి. వాటిలో యాదాద్రి ఒకటి. యాదగిరిగుట్టలో కొలువు తీరిన శ్రీలక్ష్మీనరసింహస్వామి.. భక్తుల కోరిన కోరికలు తీరుస్తాడని ప్రజలు బలంగా నమ్ముతారు. మరోవైపు ఆ ఆలయాన్ని పునర్నిర్మాణం చేశారు. ఆ క్రమంలో యాదగిరిగుట్ట కాస్తా యాదాద్రిగా మారింది. తిరుమల తరహాలోనే యాదాద్రిలో ఆలయ నిర్మాణం చేపట్టారు. దీంతో మాఢ వీధులు, స్వామి వారి పూజా కైంకర్యాలు, ఆర్జిత సేవలు, వీఐపీ దర్శనాలు, ప్రసాదాలతో యాదాద్రి.. తెలంగాణ తిరుమలగా రూపుదిద్దుకొంది. ఇంకోవైపు వీఐపీ, వీవీఐపీలు, సిఫార్సులపై వచ్చే భక్తులకు రూ.300 టికెట్ ద్వారా బ్రేక్ దర్శనం కల్పిస్తున్నారు. రూ. 150 చెల్లించి శీఘ్ర దర్శనం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం ఉంది. కానీ అన్ని సేవలను ఇకపై ఆన్‌లైన్ ద్వారా అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు యాదాద్రి దేవస్థానం ఉన్నతాధికారులు తెలిపారు.

## నకిలీ పత్తి విత్తనాల గుట్టురట్టు.. రూ.19 లక్షల విలువచేసే విత్తనాలు స్వాధీనం




ఆదిలాబాద్ : ఆదిలాబాద్ పట్టణంలో నకిలీ పత్తి విత్తనాల తయారీ కేంద్రం గుట్టురట్టయింది. శుక్రవారం మధ్యాహ్నం రాంనగర్ ప్రాంతంలో గోదాంలో నకిలీ విత్తనాలు తయారీ కేంద్రంపై పోలీసులు దాడి చేసి నిర్వాహకుడితో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వివిధ కంపెనీలకు చెందిన 945 పత్తి విత్తనాల ప్యాకెట్లతో పాటు 50 కిలోల విడి పత్తి విత్తనాలు, 330 బ్యాగులు జొన్న విత్తనాలు, నకిలీ విత్తనాల తయారీకి ఉపయోగించే కలర్, కెమికల్‌ను పట్టుకున్నారు. వీటి విలువ రూ.19,39,908 ఉంటుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య తెలిపారు. విత్తన కేంద్రం నిర్వాహకుడు సామ అశోక్ రెడ్డితో పాటు అందులో పనిచేసే మరో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ముస్లిం రిజర్వేషన్లపై మాట్లాడితే ప్రధాని మోదీపై పరువునష్టం దావా వేస్తా: షబ్బీర్ అలీ హెచ్చరిక

**ముస్లిం రిజర్వేషన్ల అంశం ప్రస్తుతం సుప్రీంకోర్టు పరిధిలో ఉందన్న షబ్బీర్ అలీ**

**అలాంటప్పుడు ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని ఎలా చెబుతారు? అని ప్రశ్న**

**ముస్లిం రిజర్వేషన్లు మతప్రాతిపదికన ఇవ్వలేదు... పేదరికం ఆధారంగా ఇచ్చారన్న షబ్బీర్ అలీ**

ప్రధాని నరేంద్రమోదీ ముస్లిం రిజర్వేషన్ల గురించి మాట్లాడితే తాను పరువునష్టం దావా వేస్తానని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ముస్లిం రిజర్వేషన్ల అంశం ప్రస్తుతం సుప్రీంకోర్టు పరిధిలో ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ముస్లిం రిజర్వేషన్లపై మోదీ, అమిత్ షా వ్యాఖ్యలు సరికాదన్నారు. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని వారు ఎలా చెబుతారు? అని ప్రశ్నించారు. ముస్లింలలో అందరికీ రిజర్వేషన్లు లేవని... వెనుకబడిన వర్గాలకు మాత్రమే ఇచ్చారన్నారు. హిందూ, ముస్లిం అంటూ ప్రజల మధ్య మోదీ చిచ్చు పెడుతున్నారన్నారు. కోర్టులో ఉన్న అంశంపై ప్రధాని మోదీ మాట్లాడటం సరికాదన్నారు. అయినా మైనార్టీ రిజర్వేషన్లు మతప్రాతిపదికన ఇవ్వలేదన్నారు. పేదరికం ఆధారంగా ఇచ్చారని తెలిపారు. ఈ రిజర్వేషన్లు ఇచ్చి కూడా రెండు దశాబ్దాలు దాటిందన్నారు. ముస్లిం రిజర్వేషన్లపై కోర్టుల ఆదేశాలు, జీవోలను ప్రధాని మోదీకి పంపిస్తున్నామన్నారు.

## రైతులను కాంగ్రెస్ సర్కార్ దగా చేసింది

-మొదటి పేజి తరువాయి



దగా చేశాడని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ. 2,683 రూపాయల మద్దతు ధర ఇస్తామని ప్రకటన చేశారు. సన్న వడ్లకు మాత్రమే ఇస్తానని చెప్పి మోసం చేస్తున్నారని వివరించారు. వడ్ల విషయంలోనే కాదు ప్రతీ అంశంలో ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని కేటీఆర్ గుర్తుచేశారు. కరెంట్ విషయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తుచేశారు. తమ హయాంలో కరెంటు సమస్య ఎలా ఉండెదో గుర్తుచేసుకోవాలని సూచించారు. ఇప్పుడు కరెంట్ కష్టాలతో రైతులకు ఇబ్బందికర పరిస్థితులు వస్తున్నాయని వివరించారు. ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలు అని ఊదరగొట్టారు. అందులో ఇప్పటివరకు ఒక్కటే అమలు చేశారని కేటీఆర్ మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఒక్క నోటిఫికేషన్ రాలేదని కేటీఆర్ విమర్శించారు. నోటిఫికేషన్ రాలేదు.. గాడిద గుడ్డు వచ్చిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వం హయాంలో మంజూరైన 30 వేల ఉద్యోగాలను కాంగ్రెస్ ప్రభుత్వం భర్తీ చేసిందని గొప్పలు చెప్పుకుంటుదని విరుచుకుపడ్డారు. నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ నేతల సయోధ్య ఉండదని.. ఇక్కడ ఆ పార్టీ నేతల ఎవరి విధానాలు వారివే ఉంటాయని కేటీఆర్ ఆరోపించారు.

# బాజాప్తా చెరువుల మట్టిని తోడేస్తున్నారు

**జోరుగా అక్రమ మట్టి దందా**

**అధిక లోడుతో రోడ్లు ధ్వంసం అనుమతులు లేని రవాణా...**

**ప్రభుత్వ ఆదాయానికి గండి**




**పెద్దపల్లి :** వేసవి కాలం మొదలు కాగానే అక్రమ మార్కుల కన్నులు చెరువు మట్టిపై పడుతాయి. ప్రభుత్వం అనుమతి ఇచ్చిందే తడువు ఇక దోపిడీకి తెర లేపడం తరువాయి. ఇక ఇక్కడి నుండి సినిమా మొదలవుతుంది. ఆ ఊరు గ్రామ పంచాయితీ పర్మిషన్ నుండి మొదలు కొని వే బిల్లులు, ఆ పర్మిషన్ ఈ పర్మిషన్ అంటూ ఇటు అధికారుల తిరకాసులతో సదరు కాంట్రాక్టర్ల పరుగులు. ఇక అంతా అయిందనుకునే సమయంలోనే చిన్నా చితిక పెద్ద పత్రికలు, మీడియా చానళ్ళు. మళ్ళీ ఊపిరి పీల్చుకునే సమయంలో పలు సంఘాలు, ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు గద్దల్లా వాలుతారు. అన్ని దులిపేసుకుని మట్టి దందా మొదలు కావడం కొద్ది రోజులు సజావుగా సాగుతుంది. సదరు కాంట్రాక్టర్ ఇక అడ్డు అదుపు లేకుండా 24/7 తన పని తాను కానిస్తుంటాడు. అందరికి సర్దుబాటు జరిగితే అటు వైపు ఏ ఒక్కరు కన్నెత్తి చూడరు. ఎవరికీ తక్కువైనా కాంట్రాక్టర్ కథ మళ్ళీ మొదటికే వస్తుంది. ఈలోగా కాంట్రాక్టర్ తన పని పూర్తి చేసుకొని దుకాణం మూసుకుంటాడు. కానీ ఇక్కడ తనిఖీ చేయాల్సిన అధికారులు ఎందుకు విధులు సరిగా నిర్వహించడం లేదు. అను మతి ఇచ్చి చేతులు దులుపు కుంటే సరిపోతుందా. నిత్యం వందలాది టిప్పర్లు, లారీలు ఆయా మండలాల నుండి పెద్దపల్లి జిల్లా కేంద్రం నుండి ఇటుక బట్టీలకు మట్టి రవాణా జరుగుతున్నా చోద్యం చూస్తున్నారు. ప్రజా ధనం లూటి అవుతున్నా, వేల వేలకు జీతాలు తీసుకొని విధులు సక్రమంగా నిర్వహించని ఇలాంటి అధికారులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాంట్రాక్టర్ నుండి ముడుపులు ముడితే ఒకలా లేకపోతే మరోలా ఉండే అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా కేంద్రానికి పక్కనే ఉన్న కమాన్ పూర్, రామగిరి మండలాల నుండి ఆయా గ్రామాల మీదుగా చెరువు మట్టిని రాఘవాపూర్ ఇటుక బట్టీలకు టిప్పర్ల ద్వారా బాజాప్తా మట్టిని తరలిస్తున్న కాంట్రాక్టర్ సరైన పత్రాలు లేకుండా నిర్భయంగా తరలించడంలోని ఆంతర్యం ఏమిటి. ఆయా మండలాల అధికారులు ఏమి చేస్తున్నట్లు. గత పదిహేను రోజులుగా ఈ తతంగం సాగుతున్నదని పలువురు ప్రజలు పేర్కొంటున్నారు. నిత్యం మంథని – పెద్దపల్లి జిల్లా కేంద్రానికి తనిఖీల పేరుతో తిరిగే జిల్లా స్థాయి అధికారులకు కూడా కనిపించడం లేదా అంటూ పలువురు ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఇటీవల గ్రీన్ ట్రైబ్యునల్ తీర్పుతో హడావుడి చేస్తున్న అధికారులు తమ భాధ్యతలు ఇప్పటి వరకు ఎందుకు మరిచినట్లు. కోర్టు చెపితే గానీ భాధ్యతలు గుర్తుకు రావా అంటున్నారు ఆయా స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు. ఇది కూడా ప్రజల పిర్యాదు చేస్తే కానీ అధికారులు స్పందించాల్సి రావడం దురదృష్టకరం. నిత్యం జరుగుతున్న ఇలాంటి దోపిడీని అరికట్టేందుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ఆశల పల్లకీలో ఆదిశ్రీనివాస్



**కరీంనగర్ :** ఎంపీ ఎన్నికలు ముగిశాయి. కాంగ్రెస్ నేతల్లో ఆశలు మొదలయ్యాయి. దీంతో క్యాబినెట్ విస్తరణ చేస్తారన్న ప్రచారం జోరందుకుంది. సీఎం రేవంత్ టీమ్ లో స్థానం దక్కేదెవరికి? ఏయే సామాజికవర్గాలకు ఛాన్స్ దక్కనుంది? సీనియర్లకు ప్రాధాన్యత ఇస్తారా? కొత్త వాళ్లను మంత్రి వర్గంలోకి తీసుకుంటారా? సీఎం రేవంత్ రెడ్డి మనసులో ఉన్న ఆ ఆరుగురు అదృష్టవంతులు ఎవరు?తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు వేళైంది. సీఎం రేవంత్ రెడ్డి టీమ్ లో త్వరలో ఆరుగురు కొత్త వాళ్లు చేరబోతున్నారు. ప్రస్తుత మంత్రివర్గం లో 11మంది ఉన్నారు. 119 అసెంబ్లీ నియోజకవర్గాల ప్రకారం 15శాతం మందిని మంత్రివర్గంలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఆ లెక్కన సీఎంతో పాటు 17మంది మంత్రులు ఉండాలి. ప్రస్తుతం కేబినెట్ లో ముఖ్యమంత్రితో పాటు 11మంది మంత్రులే ఉన్నారు. దీంతో మరో ఆరు బెర్తులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణ చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తోంది.మంత్రివర్గ విస్తరణ వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ నేతల్లో ఆశలు మొదలయ్యాయి. కేబినెట్ లో చోటు కోసం సీనియర్లు, కొత్త వాళ్లు తెగ ఆరాట పడుతున్నారు. అయితే, సామాజిక సమీకరణాల్లో భాగంగా ఎవరికి వారే తమకు బెర్తు కన్ ఫర్మ్ అని ధీమాగా ఉన్నారు. అయితే ఎన్నికల ప్రచారంలో భాగంగా ముదిరాజ్ లకు మంత్రి పదవి ఇస్తానని బహిరంగంగా ప్రకటించారు. దీంతో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఖాయం అన్న వార్తలు వినిపిస్తున్నాయి.అయితే ముదిరాజ్ సామాజికవర్గాన్ని లీడ్ చేయగల వ్యక్తికి ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి ఇస్తే బాగుంటుందని ప్రభుత్వ పెద్దలు ఆలోచిస్తున్నట్లు సమాచారం. అటు ఎమ్మెల్సీ వెంకట్ బల్మూర్ ను క్యాబినెట్ లోకి తీసుకుంటారనే చర్చ బలంగా వినిపిస్తోంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ వాయిస్ ను వెంకట్ జనంలోకి బలంగా తీసుకెళ్లారు. దీంతో పాటు వెంకట్ కు సీఎం రేవంత్ రెడ్డితో, పార్టీ అధిష్ఠానం దగ్గర గుడ్ విల్ ఉంది. ఈ క్రమంలో ఆయనకు మినిస్టర్ పోస్ట్ పక్కా అంటున్నారు.మున్నూరు కాపుల్లో బలమైన నాయకుడిగా ఉన్న ఆది శ్రీనివాస్ కు కూడా మినిస్టర్ హోదా దక్కే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. తెలంగాణలో కురుమ సామాజికవర్గం ఓట్లు భారీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో కురుమ సామాజికవర్గానికి చెందిన బీర్ల ఐలయ్యకు మంత్రిపదవి ఇస్తారని జోరుగా చర్చ జరుగుతోంది.మంత్రివర్గ విస్తరణలో భాగంగా ఎస్టీ సామాజికవర్గానికి మినిస్టర్ పోస్ట్ ఇచ్చే ఆలోచనలో కాంగ్రెస్ సర్కార్ ఉంది. ముఖ్యంగా లంబాడ ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారట. అదే జరిగితే దేవరకొండ ఎమ్మెల్యే భాను నాయక్ ని మినిస్టర్ పదవి వరించొచ్చు. లేదా ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాకు చెందిన లంబాడ ఎమ్మెల్యేకు మంత్రివర్గంలో చోటు దక్కొచ్చు. మరోవైపు మంత్రివర్గంలో ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలకు ప్రాతినిధ్యం లేదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు మినిస్టర్ పోస్ట్ దక్కే ఛాన్స్ ఉంది. సీఎం రేవంత్ దృష్టిలో వెడ్మ బొజ్జుకు మంచి గుడ్ విల్ ఉండటంతో ఆయనకు మినిస్టర్ పోస్ట్ పక్కా అన్న ప్రచారం జరుగుతోంది.అటు ఉమ్మడి నిజామాబాద్ నుంచి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి లేదా ముస్లిం మైనారిటీ కోణంలో షబ్బీర్ అలీకి ఛాన్స్ దక్కే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. అలాగే భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ గెలిస్తే.. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మినిస్టర్ అయ్యే ఛాన్స్ ఉంటుందని ఆయన సన్నిహితులు ప్రచారం చేస్తున్నారు.ఇదిలా ఉంటే కేబినెట్ విస్తరణకు సీఎం రేవంత్ ఇప్పటికే కసరత్తు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. ఆరు మంత్రి పదవులు ఎవరికి ఇవ్వాలి అనే విషయంపై ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ఓ అభిప్రాయానికి వచ్చినట్లుగా సమాచారం. ఈ ఆరుగురిని తన కిచెన్ కేబినెట్ గా మార్చుకునేందుకు రేవంత్ రెడ్డి వ్యూహాలు రచిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో నలుగురు ఐదుగురు మినహా మిగతా వారు పార్టీ లైన్ ను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కానీ ప్రభుత్వ నిర్ణయాలను, కార్యక్రమాలను ప్రజలకు వివరించడంలో పెద్దగా చొరవ చూపడం లేదనే నిర్ణయానికి రేవంత్ వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే కొత్త మంత్రులతో ఈ అంశాలన్నింటిని భర్తీ చేయాలని రేవంత్ ఆలోచిస్తున్నట్లు సమాచారం. మొత్తానికి క్యాబినెట్ బెర్తుల అంశం ప్రస్తుతం తెలంగాణలో హాట్ టాపిక్ గా మారింది. మంత్రివర్గంలో ఏ సామాజికవర్గానికి? ఏ వ్యక్తికి స్థానం దక్కుతుందో? అనేది ఆసక్తికరంగా మారింది.

# అడగడుగునా... నిర్లక్ష్యం



**వరంగల్ :** కాళేశ్వరం బ్యారేజీల కుంగివేతలకు గల కారణాల అధ్యయనం కోసం ఎట్టకేలకు రాష్ట్రానికి కేంద్ర నిపుణుల బృందం వచ్చింది. సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్(సిడబ్ల్యూటిఆర్ ఎస్) టీమ్ పూణే నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చేరుకుంది. అందులో భాగంగా మొదటగా మేడిగడ్డ,అన్నారం బ్యారేజ్ లను నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి నిపుణుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా మేడిగడ్డ వద్ద కుంగిన వంతెనను నిపుణుల బృందం తరువుగా చెక్ చేసింది. గత ఏడాది సెప్టెంబర్ లో కుంగిన పిల్లర్ల వద్దకు వెళ్లి అక్కడ జరిగిన పనుల తీరును పరిశీలించింది. అలాగే అంతకుముందు డ్యామ్ సేఫ్టీ విషయంలో చేసిన పరీక్షల గురించి నీటిపారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకుంది.డ్యాం క్రస్ట్ గేట్లను కేంద్ర బృందం చెక్ చేసింది. వాటి క్వాలిటీ.. క్రస్ట్ గేట్ల చుట్టుపక్కల డ్యాంకు వాడిన మెటీరియల్ ప్రామాణికతను పరిశీలించింది. మేడిగడ్డ,అన్నారం బ్యాలెన్స్ సింగ్ రిజర్వాయర్ల పూర్తి కోసం గుత్తేదారులు ఎంత టైం తీసుకున్నారన్న విషయంపైన కూడా ఆరా తీసింది. మరోవైపు గత ఏడాది వర్షాకాలం సందర్భంగా రిజర్వాయర్ల వద్ద బుంగలు ఏర్పడడానికి గల కారణాలపై రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులు ఏ రకమైన నివేదికలను అప్పటి ప్రభుత్వానికి అందజేశారు అనే అంశం గురించి కూడా అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన సమాచారాన్ని కూడా వారు రికార్డు చేశారు. ఈ నేపథ్యంలోనే రిజర్వాయర్ల వద్ద భారీ ఎత్తున ఇసుక మేటలు కూరుకపోవడంపై వారు కొంత ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఇసుక దిబ్బలు ఎక్కువైతే డ్యాములకు మరింత ప్రమాదం చేకూరవచ్చని నీటిపారుదల అధికారులకు సూచించినట్లు తెలుస్తోంది. అందువల్ల ఇసుక మేటలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.డ్యాములు భవిష్యత్తులో పనికొచ్చే అవకాశం ఉందా..? లేక ప్రత్యామ్నాయ మార్గాలను ఏమైనా చేసుకోవాల్సి ఉంటుందా..? అనే అంశాన్ని కూడా కేంద్ర నిపుణుల బృందం తరువుగా పరిశీలించింది. ఇందుకోసం రిజర్వాయర్ల పరిసరాల్లో భూగర్భ పరీక్షలను నిర్వహించింది. సాయిల్ కు సంబంధించిన ఈ ల్యాండ్ ఎగ్జామినేషన్ ను కూడా చేపట్టింది. తాత్కాలికంగానైనా ఈ ప్రాజెక్టులను వాడుకోవచ్చా..? లేదా..? అనే అంశంపై కేంద్ర బృందం ఇప్పటికే ఓ అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. డ్యాముల వద్ద భారీగా బొగ్గు నిక్షేపాలున్నట్లు ఉన్నట్లు సెంట్రల్ టీం తేల్చింది. అయితే ఆ బొగ్గు నిక్షేపాల వల్ల కూడా రిజర్వాయర్లకు భవిష్యత్తులో ప్రమాదాలు జరగొచ్చని అంచనా వేస్తోంది. ఇక సుందిళ్ల బ్యారేజ్ ను కూడా సందర్శించిన తర్వాత కేంద్ర బృందం తన నివేదికలను అటు సెంట్రల్ గవర్నమెంట్ కు.. ఇటు రాష్ట్ర ప్రభుత్వానికి పంపనుంది. ఈ నివేదికలు అందిన తర్వాత మరో రెండు సంస్థల చేత డ్యాముల భద్రతపై చేయించిన పరిశీలన నివేదికలను కూడా ఎగ్జామినేషన్ చేసి ప్రభుత్వం ఓ అంచనకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ నివేదికలు ఎలా ఉన్నా.. తాత్కాలికంగా మాత్రం రిజర్వాయర్ల మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. పూణే నుంచి వచ్చిన సెంట్రల్ టీం అనేక లోపాలను గుర్తించింది. అందువల్ల వాటిని కూడా సీరియస్ గా పరిగణలోకి తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

## కల్లు విషయంలో దాడి..బాధితుడికి గాయాలు

**వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా గెరిగేంట్ పల్లిలో దారుణం జరిగింది. కల్లు వ్యాపారి ఓ వ్యక్తిని కర్రతో వాతలు వచ్చేలా కొట్టి తలపై తీవ్రం దాడి చేసాడు. కల్లు ధర అమాంతం ఐదు రూపాయలు ఎలా పెంచుతరని అడగడమే దాడికి పాల్పడ్డారని బాధితుడు శ్రీనివాస్ ఆరోపించాడు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని గెరిగేంట్ పల్లి లో పది రూపాయలు ఉన్న కల్లు సీసా ధర రూ.పదిహేను కు వ్యాపారి దత్తాత్రేయ గౌడ్ పెంచాడు. కల్లు సేవించి ధరపై ప్రశ్నించిన శ్రీనివాస్... కల్లు వ్యాపారి దత్తాత్రేయ గౌడ్ వాగ్వివాదం జరిగింది. దత్తాత్రేయ గౌడ్ అనుచరులతో కలిసి శ్రీనివాస్ మరో వ్యక్తిపై దాడి జరిపారు. శ్రీనివాస్ కు తలపై... వొంటిపై తీవ్రంగా గాయాలు అయ్యాయి. కులం పేరుతో దూషించి దాడిచేశారని వికారాబాద్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసాడు

## స్కూలు ఆవరణలో బోరు వినియోగం

**మేడ్చల్ :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం బాచుపల్లి జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాల గ్రౌండ్ ను. హైదరాబాద్ వాటర్ వర్క్స్ వారు ట్యాంకర్ తో గ్రౌండును పార్కింగ్ గా చేసుకొని వారి వినియోగానికి వాడుకుంటున్నారని బాచుపల్లి గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గవర్నమెంట్ పట్టించుకోని ఇక్కడ ఉన్నటువంటి పిల్లలకు ప్లే గ్రౌండ్ స్కూల్ వాళ్లకే ఇవ్వాలని కోరుచున్నారు వారి స్థలంలో అక్రమంగా వాడుకుంటున్నారని కౌన్సిలర్లు ఆగం పాండు, కాసాని సుధాకర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

## ఆస్ట్రేలియాలో షాద్ నగర్ వ్యక్తి మృతి

**షాద్ నగర్ :** ఆస్ట్రేలియా లో దారుణం జరిగింది. షాద్ నగర్ కి చెందిన అరటి అరవింద్ యాదవ్ అనుమానాస్పద మృతి చెందాడు. ఆరవింద్ 5 రోజుల క్రితం అదృశ్యమైయాడు. చివరకు అరవింద్ సముద్రంలో శవమై తేలాడు. సిడ్నీ లోని సముద్ర తీరానికి కొద్ది దూరంలో అరవింద్ కారును పోలీసులు గుర్తించారు. లభించిన ఆధారాలతో చనిపోయింది అరవింద్ గా గుర్తించారు. మృతుడు ఉద్యోగం నిమిత్తం 12 ఏళ్లుగా సిడ్నీ లో స్థిరపడ్డడు. అరవింద్ ది హత్య.. ఆత్మహత్య.. అనేది విచారణ జరుపుతున్నారు. అరవింద్ కు 18 నెలల క్రితమే అరవింద్ కి వివాహం జరిగింది. పెళ్లి తర్వాత భార్య, తల్లితో కలిసి ఆస్ట్రేలియా వెళ్లాడు. తల్లి ఆరు రోజుల క్రితం ఇండియా కి తిరిగి వచ్చింది.

## ఆర్టీసీ బస్సు ఢీకొని ముగ్గురు దుర్మరణం

**రంగారెడ్డి :** ఆర్టీసీ, బస్సు ఢీకొని ముగ్గురు దుర్మరణం పాలైన ఘటన రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కల్వకుర్తి నుంచి హైదరాబాద్కు అతివేగంతో వస్తున్న కారు రాంనుంతల శివారులోకి రాగానే హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్తున్న బస్సును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కారులో ఇరుకున్న మృతదేహాలను బయటకు తీసేందుకు ప్రయత్నించారు.

## విద్యార్థిని మృతికి నిరసన

**భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాచలం మారుతి పారా మెడికల్ నర్సింగ్ కాలేజి విద్యార్థిని కారుణ్య మృతికి నిరసనగా అఖిలపక్ష విద్యార్థి సంఘం నాయకులు,బంధువుల ర్యాలీ చేపట్టి, ,కాలేజి ఎదుట ధర్నా చేసారు. కాలేజిని సీజ్ చేయాలని,మృతురాలి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేసారు. కాలేజి యాజమాన్యం మీద దాడికి దిగిన బంధువులు,కాలేజి చైర్మన్ డాక్టర్ కాంతారావు మరియు డ్రైవర్ పై దాడి చేసారు.

## చెరువులో అక్రమంగా తరలిస్తున్న నల్లమట్టి పట్టుకున్న పోలీసులు..

**కోహెడ పోలీస్ స్టేషన్ పరిధిలో కూరెళ్ల గ్రామంలోని పెద్ద చెరువు లో నల్ల మట్టి పట్టివేత..**



**కోహెడ :** కూరెళ్ల, మండలం కోహెడ, అతను ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా చెరువులో నుండి నల్ల మట్టిని, జెసిపి తొమ్మిది ట్రాక్టర్లతో తన ఇటుక బట్టీల వద్దకు తరలిస్తున్నాడని, నమ్మదగిన సమాచారం రాగా సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీస్ అధికారులు సిబ్బంది కోహెడ ఎస్ఐ తిరుపతి, సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. కోహెడ పోలీసులు పూర్తి విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటారు.ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ పోలీస్ అధికారులు, మాట్లాడుతూ. పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక రేషన్ బియ్యం, అక్రమ రవాణా చేసిన నిల్వ ఉంచిన, చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూదం, గ్యాంబ్లింగ్ చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.గ్రామాలలో, పట్టణాలలో ఇసుక అక్రమ రవాణా చేసిన, పిడిఎస్ రైస్ అక్రమంగా దాచిపెట్టిన రవాణా గ్యాంబ్లింగ్, పేకాట, మరిఏదైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445. 8712667446. 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

## ట్రాక్‌పై నిలిచిపోయిన లారీ.. ఆగిపోయిన రైళ్లు



**విజయనగరం :** రైల్వే ట్రాక్ పై లారీ నిలిచిపోయిన ఘటన గజపతినగరం మండలం పురిటిపెంట దగ్గర చోటు చేసుకుంది. దాంతో గురువారం తెల్లవారుజాము నుంచి రైళ్ల రాకపోకలుఆగి పోయాయి. మరోవైపు రోడ్డు ట్రాఫిక్ కుడా ఆంధ్ర రహదారిపై కిలోమీటర్ల మేర జామ్ అయింది. ప్రయాణికుఉ తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## వృద్ధురాలి నోట్లో బట్టలు కుక్కి 3 తులాల బంగారాన్ని ఎత్తుకుపోయిన మాజీ మహిళా వాలంటీర్

**విజయనగరం :** వృద్ధురాలి నోట్లో బట్టలు కుక్కి 3 తులాల బంగారాన్ని మాజీ మహిళా వాలంటీర్ దోచుకెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాడంగి మండలం ముగడ గ్రామంలోని ఓ ఇంట్లో ఒంటరిగా అచ్చెమ్మ అనే వృద్ధురాలు నివసిస్తోంది. మాజీ మహిళా వాలంటీర్ స్వాతి ఆ వృద్ధురాలి నోట్లో బట్టలను కుక్కి 3 తులాల బంగారాన్ని ఎత్తుకుపోయింది. అయితే ఆ వృద్ధురాలు మరణించిందని మహిళా వాలంటీర్ భావించింది. దొంగతనం విషయం వెలుగులోనికి రావడంతో మాజీ వాలంటీర్ స్వాతి ఉలిక్కిపడింది. సంగతి పోలీసులకు తెలియడంతో ఎస్సై జయంతి ఆమెను పోలీస్ స్టేషన్కు పిలిపించారు. ఎస్ఐ వద్ద నిజం ఒప్పుకోవడానికి మాజీ వాలంటీర్ మొండికేసింది. ఆ తరువాత ఎట్టకేలకు మాజీ వాలంటీర్ స్వాతి దొంగతనం చేసిన విషయాన్ని ఒప్పుకొని బంగారం ఇస్తానని చెప్పింది